క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హన్మకొండ: హనుమకొండలోని పలు ప్రాంతాల్లో ఈ నెల 5న విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని ఎన్పీడీసీఎల్ హనుమకొండ టౌన్ డీఈ జి.సాంబరెడ్డి తెలిపారు. సాయినగర్, కంచరకుంట, లష్కర్‌బజార్ మెయిన్ రోడ్డులో ఉదయం 8గంటల నుంచి 10గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

భూమికి హద్దులు నిర్ధారించాలి



హసన్‌పర్తి: వ్యవసాయ కళాశాల కోసం సేకరించిన భూమికి హద్దులు నిర్ధారించాలని అధికారులను ఆర్డీఓ ఎన్.వెంకటేష్ ఆదేశించారు. హసన్‌పర్తి మండలం సిద్ధాపురంలో వ్యవసాయ కళాశాల కోసం సేకరించిన భూమిని బుధవారం పరిశీలించారు. కబ్జాలోకు గురైన భూమిని సర్వే చేసి స్వాధీనం చేసుకోవాలని సూచించారు. అనంతరం ధరణి దరఖాస్తులను పరిశీలించారు. ఆర్డీఓ వెంట ఇన్‌చార్జ్ తహసీల్దార్ రహీం, ఆర్ఐ రాజేంద్రప్రసాద్, స్థానికులు ఉన్నారు.

కేయూ భూముల్ని పరిరక్షించాలి



కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ భూములను పరిరక్షించాలని, క్యాంపస్ చుట్టూ ప్రహరీ నిర్మించాలని ఏబీఎస్ఎఫ్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు మంద నరేష్ డిమాండ్ చేశారు. ఈమేరకు కేయూలో బుధవారం సమావేశంలో ఆయన మాట్లాడారు. యూనివర్సిటీ భూములు కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో ఏబీఎస్ఎఫ్ కేయూ జనరల్ సెక్రటరీ బండారి పృథ్వీరాజ్, కేయూ ఉపాధ్యక్షుడు హర్షం చరణ్, అశోక్‌రాజు, కిరణ్, వెంకటేష్ పాల్గొన్నారు.

ఎస్సీ మోర్చా జిల్లా ఇన్‌చార్జ్‌గా రామిండ్ల బాబురావు



కాజీపేట అర్బన్: భారతీయ జనతా పార్టీ ఎస్సీ మోర్చా వరంగల్ జిల్లా ఇన్‌చార్జ్‌గా న్యూశాయంపేటకు చెందిన రామిండ్ల బాబురావును నియమించారు. ఈమేరకు రాష్ట్ర ఎస్సీ మోర్చా అధ్యక్షుడు, వరంగల్ జిల్లా ఇన్‌చార్జ్ కొండేటి శ్రీధర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

డివిజన్ అభివృద్ధికి కృషి



హసన్‌పర్తి: 55వ డివిజన్ అభివృద్ధికి కృషి చేస్తానని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు అన్నారు. ఇటీవల కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో నీటి నక్షత్రకాలనీ, బాలాజీ కాలనీల్లో ఎమ్మెల్యే బుధవారం పర్యటించారు. ఈ సందర్భంగా ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. విషజ్వరాలు ప్రబలకుండా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. మురుగునీటి కాల్వలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని పారిశుద్ధ్య సిబ్బందికి సూచించారు. మురుగు కాల్వల నిర్మాణానికి రూ.10 లక్షలు, స్మార్ట్ సిటీ కింద అభివృద్ధి పనులకు రూ.2కోట్లు మంజూరు చేస్తానని ప్రకటించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ జక్కుల రజిత, మాజీ కార్పొరేటర్ జక్కుల వెంకటేశ్వర్లు, మాజీ వార్డు సభ్యుడు గడ్డం శివరాంప్రసాద్, నాయకులు బూర సారంగపాణి, మార్క్ రాజు, కాలనీ అధ్యక్షుడు సారంగపాణి, కాలనీవాసులు పాల్గొన్నారు.

ఆర్టిజన్లకు పదోన్నతి కల్పించాలి



హన్మకొండ: విద్యుత్ ఆర్టిజన్ ఉద్యోగులకు పదోన్నతి కల్పించాలని తెలంగాణ రాష్ట్ర విద్యుత్ కార్మిక సంఘం (టీఆర్‌వీకేఎస్) రాష్ట్ర అధ్యక్షుడు కేవీ.జాన్సన్, ప్రధాన కార్యదర్శి కోడూరి ప్రకాష్ కోరారు. హనుమకొండలోని టీజీ ఎన్పీడీసీఎల్ ప్రధాన కార్యాలయంలో సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డిని టీఆర్‌వీకేఎస్ ప్రతినిధులు బుధవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలోని విద్యుత్ సంస్థల్లో పనిచేస్తున్న అవుట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగులను ప్రభుత్వం సంస్థ ఉద్యోగులుగా ఆర్టిజన్ పేరుతో తీసుకుందని, వారి విద్యార్హతలను బట్టి గ్రేడ్ -1, గ్రేడ్ -2, గ్రేడ్ -3, గ్రేడ్ -4 ఆర్టిజన్‌గా అవకాశం కల్పించినట్లు వివరించారు. వారు ఆరేళ్లుగా అంకితభావంతో, నిజాయితీగా పని చేస్తున్నారని గుర్తుచేశారు. స్టాండింగ్ ఆర్డర్స్ ప్రకారం ఐదేళ్ల సర్వీస్ పూర్తి చేసుకున్న ఆర్టిజన్లకు తదుపరి గ్రేడ్‌లోకి పదోన్నతి కల్పించాలని ఉందని పేర్కొన్నారు. టీఆర్‌వీకేఎస్ ఎన్పీడీసీఎల్ కార్యదర్శి బండారు ప్రభాకర్, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీధర్ గౌడ్, అదనపు కార్యదర్శి గోపాల్ రావు, ఉపాధ్యక్షుడు నరేంద్రపాల్ పాల్గొన్నారు.

నేడు ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం

- హనుమకొండ జిల్లాలో 31 మంది, వరంగల్‌లో 60 మంది ఉపాధ్యాయులకు అవార్డులు

విద్యారణ్యపురి: జాతీయ ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని హనుమకొండ జిల్లాలో 31మంది, వరంగల్ జిల్లాలో 60మందిని జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయులను ఎంపిక చేసినట్లు డీఈఓలు డి.వాసంతి, ఎం.జ్ఞానేశ్వర్ బుధవారం తెలిపారు. హనుమకొండలో 28మంది ప్రభుత్వ యజమాన్యాల పాఠశాలల నుంచి కాగా, మరో ముగ్గురు ప్రైవేటు హైస్కూళ్ల నుంచి ఎంపిక చేశారు. వారందరికి గురువారం సాయంత్రం హనుమకొండ కలెక్టరేట్‌లో సన్మాన కార్యక్రమం ఉంటుంది. వరంగల్‌కు చెందిన ఉత్తమ ఉపాధ్యాయులను ఉర్సుగుట్ట సమీపంలోని ఆకుతోట కన్వెన్షన్‌హాల్‌లో సన్మానించనున్నారు.

ఎంపికైనవారు వీరే..

ఎం.వేణు ఆనంద్ (జెడ్పీహెచ్ఎస్ రాంపూర్, కాజీపేట), కె.హనుమంతరావు (జెడ్పీహెచ్ఎస్ నడికుడ), ఎ.రాజేందర్ (జెడ్పీహెచ్ఎస్ ఉప్పల్, కమలాపూర్), ఎ.రవి (జెడ్పీహెచ్ఎస్ అక్కంపేట, ఆత్మకూరు), కె.శ్రీనివాస్ (జెడ్పీహెచ్ఎస్, గట్ల నర్సింగాపూర్), పి.సిలినా (జెడ్పీహెచ్ఎస్, వెంకటాపూర్), ప్రత్యూష (జీహెచ్ఎస్, వడ్డెపల్లి), డి.రమేష్ (జెడ్పీహెచ్ఎస్, నీరుకుళ్ల, ఆత్మకూరు), బి.అశోక్ కుమార్ (జెడ్పీహెచ్ఎస్, గట్ల నర్సింగాపూర్), ఎస్.వేణుగోపాల్‌రావు (జెడ్పీహెచ్ఎస్, పీచర), పి.రవి (జెడ్పీహెచ్ఎస్, పెద్దకోడెపాక), బి.శిరీష (జెడ్పీహెచ్ఎస్, ఉప్పల్), డి.భిక్షపతి (జీహెచ్ఎస్, హనుమకొండ), ఆర్.వెంకటేష్ (ఎంపీయూపీఎస్, జగన్నాథపురం), జి.సుదర్శన్ (ఎంపీయూపీఎస్, పోచారం), బి.లత (ఎంపీయూపీఎస్, లక్ష్మీపురం), ఎం.శ్రీధర్ (ఎంపీపీఎస్, వరికోలు), ఎం.భిక్షపతి (ఎంపీపీఎస్, కంఠాత్మకూర్), ఎస్.శ్రీదేవి (ఎంపీపీఎస్, నార్లాపూర్), వి.రఘు (ఎంపీపీఎస్, పెద్దకోడెపాక), ఆర్.భిక్షపతి (ఎంపీపీఎస్, ఆత్మకూరు, గొల్లవాడ), జె.పుష్పలత (ఎంపీపీఎస్, ఆత్మకూరు), ఎన్.ప్రవీణ్‌కుమార్ (ఎంపీపీఎస్, లోక్యాతండా), ఎం.రాధిక (ఎంపీపీఎస్, ఎర్రబెల్లి), ఎ.జ్యోతి (ఎంపీపీఎస్, ముప్పారం), జి.ఉషారాణి (ఎంపీపీఎస్, పెద్దాపూర్), పి.సత్యనారాయణ రెడ్డి (జెడ్పీహెచ్ఎస్, మడికొండ), డి.నాగయ్య (జెడ్పీహెచ్ఎస్, పరకాల), టి.బుచ్చిబాబు (భారతీయ విద్యాభవన్ హైస్కూల్, హనుమకొండ), వి.మధుకర్ (మేధా కాన్సెప్ట్ స్కూల్, బాపూజీ నగర్, కాజీపేట), కె.అపర్ణ (విద్యాధరి హైస్కూల్, గోపాల్‌పూర్, హనుమకొండ).

వరంగల్ నుంచి 60 మంది

వరంగల్: జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా జిల్లాలో 60 మందిని ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపిక చేసినట్లు డీఈఓ ఎం.జ్ఞానేశ్వర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు గురువారం ఖిలావరంగల్ మండలం ఉర్సుగుట్ట సమీపంలోని ఆకుతోట కన్వెన్షన్‌హాల్‌లో జరగనున్న కార్యక్రమంలో ఉత్తమ ఉపాధ్యాయులకు కలెక్టర్ డాక్టర్ సత్య శారద చేతుల మీదుగా అవార్డులు అందజేస్తామని పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న 45 మంది గెజిటెడ్ హెడ్‌మాస్టర్లు, స్కూల్ అసిసెంట్లు, ఎస్‌జీటీలు, పీడీలు, పీఈటీలు, ప్రైవేట్ పాఠశాలల్లో పనిచేస్తున్న 15 మంది ఉపాధ్యాయులను అవార్డులకు ఎంపిక చేసినట్లు వివరించారు.

ఎంపికైన ఉపాధ్యాయులు..

డాక్టర్ బీవీఏ స్వామి, సయ్యద్ ఆరిఫ్ హుస్సేన్ (గెజిటెడ్ హెడ్‌మాస్టర్), కొండి మాధవి, బండా రవీందర్, వేలుపుల స్వర్ణలత, డింగిరి నారాయణ శాస్త్రి, ఆడెపు భిక్షపతి, షేక్ సబియాభాను, డాక్టర్ మదాత భాస్కర్, ప్రతాపగిరి రమాదేవి, సయ్యద్ ఖాజా నజీర్, పూస కిశోర్, పాత శ్యాంప్రసాద్, శ్రీరాముల రవిశంకర్, అమంచ రవికుమార్, రాజేందర్, భూమా రాజేందర్, అహల్య, జిలకర్, కోట మధుకర్, నటేశన్ మాలతి, కనకం పున్నంచందర్, పి.శంకుతలదేవి, శీలం రాజేశ్వరి, మనుపాటి వెంకటేశ్వర్లు, దొంతి రఘు, వనం శ్రావణి, గుండా వాసుదేవ్, మహ్మద్ అబ్దుల్ ముజీద్, గంగారపు మంజుల, పి.శోభ, అనుముల తేజస్విని, డాక్టర్ ఏ.భుజేందర్‌రెడ్డి, కె.వాసు, జి.సరిత, బి.ప్రమోద్‌కుమార్, జె.సునీల్ కుమార్, వై.నారాయణ, జె.బాబు, ఎం.వెంకటేశ్వర్లు, ఎస్.వనజ, బి.సారయ్య, కె.విద్యా, బి.గణేష్, పి.మేనక, బి.కవిత, కె.యమున, ప్రైవేట్ ఉపాధ్యాయులు గిరిధర్, రామగిరి స్వప్న, వెలిశోజు శేఖర్, కైటోజు సోమయ్య, చాందిని బేగం, పంచకం నర్సయ్య, సిగ్గోజు రాజేష్‌ఖన్నా, సత్యనారాయణ, గోనెల భిక్షపతి, సంగు వెంకట్రాజ్యం, శ్రీరామోజు స్వర్ణలత, బాలగోని దీప, ఉమాదేవి, సువర్ణ, సిలువేరు స్వర్ణలత.

దోషులను అరెస్ట్ చేయకపోవడం దుర్మార్గం



ధర్నా చేస్తున్న వైద్య విద్యార్థులు, మహిళా, ప్రజా సంఘాల నాయకులు

హన్మకొండ: కోల్‌కతాలో జూనియర్ వైద్యురాలిపై అత్యాచారానికి పాల్పడిన హత్య చేసిన దోషులను అరెస్టు చేయకపోవడం దుర్మార్గమని మహిళా సంఘాల నాయకులు విమర్శించారు. బుధవారం రాత్రి హనుమకొండలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద మహిళా, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ధర్నా చేశారు. ఈ సందర్భంగా చైతన్య మహిళా సంఘం నాయకులు అనిత, కళ, ఎస్ఎఫ్ఐడబ్ల్యూ నాయకురాలు సదాలక్ష్మి మాట్లాడుతూ సంఘటన జరిగిన సుమారు నెల రోజులవుతున్నా నిందితులను అరెస్టు చేయకపోవడంలో అంతర్యమేమిటని ప్రశ్నించారు. మాజీ ప్రిన్సిపాల్ సందీప్ ఘోష్‌ను ఆర్థిక అవినీతిపై మాత్రమే అరెస్టు చేశారని తెలిపారు. సంఘటనలో చివరగా ఉన్న సంజయ్‌రాయ్‌ను ప్రధాన నేరస్తుడిగా చిత్రీకరించి కేసు మూసి వేయాలనే కుట్రలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ధర్నా కార్యక్రమంలో ఆయా సంఘాల బాధ్యులు శ్రీనివాసరెడ్డి, శ్రీనివాసులు, సంజీవరెడ్డి, రాజ్‌కుమార్, వెంగల్‌రెడ్డి, హరికృష్ణ, యాదగిరి, పద్మజ, ప్రవీణ్, ఇందిర, ప్రొఫెసర్ సారంగపాణి, జ్యోతిర్మయి, వైద్య విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో పిల్లలకు ఆరోగ్యం



బాలామృతం అందిస్తున్న సూపర్‌వైజర్ రమాదేవి

ఖిలా వరంగల్: పౌష్టిక ఆహారంతో పిల్లలు ఆరోగ్యం ఉంటారని ఐసీడీఎస్ వరంగల్ ప్రాజెక్ట్ ఉర్సు సూపర్‌వైజర్ బత్తిని రమాదేవి సూచించారు. పోషణ మాసోత్సవంలో భాగంగా వరంగల్ ఉర్సు కరీమాబాద్‌లోని రజక వీధి, బీరన్నకుంట అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు బుధవారం ఆకలి పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా లబ్ధిదారులకు బాలమృతం, ప్లస్‌తోపాటు పౌష్టికాహారం అందిస్తున్నట్లు తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందించే సేవలను గర్భిణులు, బాలింతలు, చిన్నారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు రాధ, ఆశ, చిన్నారులు, పిల్లల తల్లులు పాల్గొన్నారు.

ముంపు ప్రాంతాల్లో వీడని వరద నీరు



ఎన్టీఆర్‌నగర్‌లో రోడ్డుపై నిలిచిన వరద నీరు



ఆహార ప్యాకెట్లు అందజేస్తున్న కార్పొరేటర్ రవి

వరంగల్ అర్బన్: ఎన్టీఆర్ నగర్‌వాసులకు అసలు కష్టాలు మొదలయ్యాయి. వరద నీరు తగ్గిందని పునరావాస కేంద్రం నుంచి బుధవారం ఇళ్లకు చేరుకున్న బాధితులకు నివాస గృహాల్లోని దృశ్యాలు, పరిస్థితులు ఆందోళన కలిగిస్తున్నాయి. బురదను తొలగించడానికి నీరు అందుబాటులో లేకపోవడంతో వారు అనేక అవస్థలు ఎదుర్కొన్నారు. ఇళ్ల చుట్టూ, ఖాళీ స్థలాలు, రోడ్లపై ఉన్న వరద నీరు స్తంభించిపోయింది. ఆ నీటితోనే సామగ్రిని శుభ్రం చేసుకున్నారు. దుస్తులు, నిత్యావసర వస్తువులు పాడైపోయాయని వాపోయారు. పారిశుద్ధ్య లోపంతో అంటురోగాల బారినపడే అవకాశం ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని వరద బాధితులు కోరుతున్నారు.

బాధితులకు ఆహార ప్యాకెట్ల పంపిణీ

ఖిలా వరంగల్: వరంగల్ 40వ డివిజన్ ఉర్సు కరీమాబాద్‌లోని డీకేనగర్‌లో వరద బాధితులకు స్థానిక కార్పొరేటర్ మరుపల్లి రవి బుధవారం ఆహార ప్యాకెట్లు పంపిణీ చేశారు. బాధితులను దాతలు ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో కుండే రాజు, నరసింహ, కుండే కుమార్‌స్వామి, దాసరి రాజు, సాంబరాజు, పిట్టల హరికృష్ణ, శంకర్, రావుల రవి, సమ్మయ్య పాల్గొన్నారు.

6న రౌండ్ టేబుల్ సమావేశం



సీపీఎం హనుమకొండ కార్యదర్శి చక్రపాణికి ఆహ్వాన పత్రం అందిస్తున్న నాయకులు

హన్మకొండ: కులగణన సాధనకు ఈ నెల 6న రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించనున్నట్లు ఆల్ ఇండియా ఓబీసీ జేఏసీ చైర్మన్ సాయిని నరేందర్ తెలిపారు. హనుమకొండలో ఆయా రాజకీయ పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధులు, బీసీ కుల, ప్రజా సంఘాల నాయకులను బీసీ సంఘాల నాయకులు బుధవారం కలిసి ఆహ్వాన పత్రాలను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత అసెంబ్లీ ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ కామారెడ్డిలో చేసిన బీసీ డిక్లరేషన్ అమలు కోసం ఎన్ని పోరాటాలు చేస్తున్నప్పటికీ ప్రభుత్వం స్పందించడం లేదని వాపోయారు. కుల జనగణన, బీసీలకు స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్ల సాధన, భవిష్యత్ ఉద్యమ కార్యాచరణ రూపొందించేందుకు ఈనెల 6న మధ్యాహ్నం హనుమకొండలోని ప్రెస్‌క్లబ్‌లో ఆల్ పార్టీ, బీసీ కుల, ప్రజా సంఘాలు, సామాజిక, ప్రగతిశీల నాయకులతో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహిస్తున్నట్లు వివరించారు. సమావేశాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆల్ ఇండియా ఓబీసీ జేఏసీ నాయకురాలు పటేల్ వనజ, పూలే యువజన సంఘం రాష్ట్ర కన్వీనర్ తాడిశెట్టి క్రాంతి కుమార్, నాయకులు కొడిపాక దేవిక, సింగారపు అరుణ, మామిడి రాకేష్, తదితరులు పాల్గొన్నారు.

ఉరేసుకుని యువకుడి ఆత్మహత్య

ఖిలా వరంగల్: తల్లిదండ్రులు మందలించడంతో ఓ వ్యక్తి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన కరీమాబాద్ రామస్వామి గుడి వద్ద మంగళవారం జరగగా బుధవారం వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం ప్రకారం కరీమాబాద్‌కు చెందిన ఎలగొండ ప్రశాంత్ (28).. తన తల్లిదండ్రులు మందలించారని మంగళవారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరులేని సమయంలో ఇంట్లోనే ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఎలగొండ సుదర్శన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న ఇన్‌స్పెక్టర్ మల్లయ్య తెలిపారు.

రైల్లో ప్రయాణికుడి మృతి

కాశిబుగ్గ: ఈస్ట్‌కోస్ట్ ఎక్స్‌ప్రెస్ రైల్‌లో అనారోగ్య కారణాలతో ఓ ప్రయాణికుడు మృతి చెందాడు. జీఆర్పీ సీఐ సురేందర్ తెలిపిన వివరాల ప్రకారం ఒడిశా రాష్ట్రం అంగుల్ బజ్రకోట్‌కు చెందిన బినాయక్ దాల్(33) హైదరాబాద్‌లో కూలీ పని చేస్తున్నాడు. అనారోగ్యం కారణాలతో ఈస్ట్‌కోస్ట్ ఎక్స్‌ప్రెస్ రైల్‌లో ఇంటికి వెళ్తుండగా వరంగల్ స్టేషన్ సమీపంలో తీవ్ర అస్వస్థతకు గురై మృతి చెందాడు. డిప్యూటీ ఎస్ఎస్ ఫిర్యాదు మేరకు హెడ్ కానిస్టేబుల్ రాజు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని ఎంజీఎం మార్చురీలో భద్రపరిచినట్లు సీఐ వివరించారు.

అదృశ్యమైన యువతి అప్పగింత

ఖిలా వరంగల్: ఇటీవల అదృశ్యమైన యువతిని ఆమె తల్లిదండ్రులకు అప్పగించినట్లు ఇన్‌స్పెక్టర్ మల్లయ్య తెలిపారు. ఆయన కథనం ప్రకారం లేబర్‌కాలనీకి చెందిన అస్మా ఇంట్లో నుంచి వెళ్లిపోయింది. సబేర భాను ఫిర్యాదు మేరకు నమోదు చేసి దర్యాప్తు చేసి హైదరాబాద్‌లో అస్మాను గుర్తించి కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు ఇన్‌స్పెక్టర్ వివరించారు.

తప్పిపోయిన వృద్ధుడు..

ఇటీవల అదృశ్యమైన వృద్ధుడిని కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు ఇన్‌స్పెక్టర్ మల్లయ్య తెలిపారు. సీఐ కథనం ప్రకారం వరంగల్ తూర్పు కోటకు చెందిన నాంద్రె రాఘవులు తప్పిపోగా, అతడి తమ్ముడి కుమారుడు నాంద్రే మహేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేసినట్లు ఇన్‌స్పెక్టర్ వివరించారు.

సంక్షిప్తంగా

మినీ జాబ్‌మేళా వాయిదా

వరంగల్: ములుగు రోడ్డు సమీపంలోని జిల్లా ఉపాధి కల్పన కార్యాలయంలో శుక్రవారం నిర్వహించనున్న మినీ జాబ్‌మేళాను వర్షాల కారణంగా వాయిదా వేసినట్లు వరంగల్ జిల్లా ఉపాధి కల్పన అధికారి ఉమారాణి ఒక ప్రకటనలో తెలిపారు. ఎప్పుడు నిర్వహించేది తెలియజేస్తామని పేర్కొన్నారు.

వాహనదారులకు డ్రైవింగ్ లైసెన్స్ తప్పనిసరి

హసన్‌పర్తి: వాహనం నడిపే ప్రతిఒక్కరూ తప్పనిసరిగా డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని డీటీసీ డాక్టర్ శ్రీనివాస్ పుప్పాల సూచించారు. నగర శివారులోని ఎస్సార్ యూనివర్సిటీలో 'లిండో బక్ రైడింగ్' కంపెనీ ఆధ్వర్యంలో బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫోన్‌లో మాట్లాడుతూ బైక్ నడపడం నేరమని హెచ్చరించారు. కార్యక్రమంలో యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ అర్చనారెడ్డి, డాక్టర్ రాజ్యలక్ష్మి, డాక్టర్ సుధాకర్, లిండో కంపెనీ ఎగ్జిక్యూటివ్ ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ విభాగానికి విరాళం

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ విభాగం రిటైర్డ్ ప్రొఫెసర్ గజ్జెల రామేశ్వరం.. ఆ విభాగానికి రూ.20 వేలు విరాళంగా అందించారు. ఈమేరకు విభాగం అధిపతి ప్రొఫెసర్ పెదమళ్ల శ్రీనివాస్‌రావుకు అందజేశారు.

కష్టపడి చదివితే బంగారు భవిష్యత్

హసన్‌పర్తి: కష్టపడితే చదివితేనే బంగారు భవిష్యత్ సొంతమవుతుందని ప్రతిమ రిలీఫ్ మెడికల్ కళాశాల మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రమేష్ అన్నారు. నగరంలోని ప్రతిమ రిలీఫ్ కాలేజ్ ఆఫ్ నర్సింగ్, ఆపిల్ స్కూల్ ఆఫ్ నర్సింగ్ కాలేజీ ఆధ్వర్యంలో ల్యాంప్ లైటింగ్ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాంకేతిక రంగంలో వస్తున్న విప్లవాత్మక మార్పులకనుగుణంగా విద్యార్థులు తమ నైపుణ్యాలు పెంపొందించుకోవాలని సూచించారు.

'8న హలో ముదిరాజ్.. చలో వరంగల్'

నయీంనగర్: ముదిరాజ్‌ల హక్కుల సాధనకు ఈనెల 8న పెద్దమ్మగడ్డ రోడ్డు శారద ఫంక్షన్ హాల్‌లో హలో ముదిరాజ్.. చలో వరంగల్ జిల్లా ముఖ్య నాయకుల సమావేశాన్ని నిర్వహించనున్నట్లు తెలంగాణ రాష్ట్ర ముదిరాజ్ మహాసభ ప్రధాన కార్యదర్శి డాక్టర్ రావుల జగదీశ్వర్ ప్రసాద్ ముదిరాజ్ తెలిపారు. ఈమేరకు హనుమకొండ ప్రెస్ క్లబ్‌లో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ముదిరాజ్‌ల హక్కుల సాధనకు జాతిని ఐక్యం చేసి, వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో రాజకీయ పునాది వేయడానికి, రాజ్యాధికారం సాధించడానికి, ముదిరాజ్ జాతిని బీసీ డీ నుంచి బీసీ ఏ లోకి మార్చడానికి చేపట్టాల్సిన కార్యాచరణపై సమావేశంలో చర్చించనున్నట్లు తెలిపారు.

మాజీ కార్పొరేటర్‌కు నివాళి

వరంగల్ / రామన్నపేట: మాజీ కార్పొరేటర్ యెలుగం శ్రీనివాస్ సంతాప కార్యక్రమానికి కొత్తవాడలోని పద్మశాలి వెల్ఫేర్ ట్రస్ట్ భవన్‌లో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మేయర్ గుండు సుధారాణి, తదితరులు హాజరై ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కొమురయ్య, అంకం రవి, కటకం విజయ్, డాక్టర్ లింగమూర్తి, వెంకటమల్లు, వలస లక్ష్మీనారాయణ, కూరపాటి సంపత్, గువ్వల రాజేందర్ పాల్గొన్నారు.

గురుకులాల్లోని సమస్యలు పరిష్కరించాలి

నయీంనగర్: తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలు, కళాశాలల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని స్వేరోస్ నెట్‌వర్క్ తెలంగాణ ప్రతినిధి ఎం.మనోజ్ డిమాండ్ చేశారు. హనుమకొండ ప్రెస్ క్లబ్‌లో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో బడుగు, బలహీన వర్గాల పిల్లలకు న్యాయం జరగడం లేదని ఆరోపించారు. సాయి, రఘు, ఆనందం, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

పలువురికి జరిమానాలు

రామన్నపేట: వరంగల్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో లైసెన్స్ లేకుండా వాహనం నడుతూ పట్టుబడిన ఐదుగురు వాహనదారులకు వరంగల్ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ గుర్రపు వీరస్వామి రూ.4 వేల జరిమానా విధిస్తూ బుధవారం తీర్పు వెల్లడించినట్లు వరంగల్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ కె.రామకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే, డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన 12 మందికి రూ.20,200 జరిమానా విధించినట్లు వివరించారు.

షెడ్డు కూల్చివేత

వరంగల్ అర్బన్: వరంగల్ బల్దియా ప్రధాన కార్యాలయాన్ని ఆనుకొని ఉన్న షెడ్డును బుధవారం తొలగించారు. పదేళ్ల క్రితం రికార్డు సెక్షన్ కోసం నిర్మించిన షెడ్డు నిరుపయోగంగా మారింది. దీంతో అది శిథిలావస్థకు చేరగా, కూలే ప్రమాదం ఉండటంతో జేసీబీతో తొలగించారు. ఈ క్రమంలో సమీపంలో ఉన్న ప్రహరీ నేలమట్టమైంది.

సమస్యలు పరిష్కరించాలని వినతి

హన్మకొండ అర్బన్: 49వ డివిజన్‌లోని ఇందిరమ్మ కాలనీ, జర్నలిస్టుల కాలనీల్లోని సమస్యలు పరిష్కరించాలని స్థానికులు కోరారు. ఈమేరకు వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డికి బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ ఈనెల 10, 11వ తేదీల్లో ఆయా కాలనీల్లో సందర్శించి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

శివనగర్‌లో చోరీ

ఖిలా వరంగల్: శివనగర్‌లో చోరీ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం ప్రకారం శివనగర్ ప్రాంతానికి చెందిన బొల్లింకల విజయ కూలీపని చేస్తూ జీవనం సాగిస్తోంది. వ్యక్తిగత పనిమీద మంగళవారం ఉదయం ఇంటికి తాళం వేసి హైదరాబాద్‌కు వెళ్లింది. బీరువాలో దాచిపెట్టిన రూ.10వేల నగదు అపహరించినట్లు బుధవారం గుర్తించారు. ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేసినట్లు మల్లయ్య తెలిపారు.

గ్యాస్‌పైపు పనులతో తాగునీటి పైపులైన్లు ధ్వంసం



పైపులైన్ పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్

కాశిబుగ్గ: కాశిబుగ్గ ఓసిటీ జంక్షన్‌లో మెయిన్ పైపులైన్ పగిలిపోవడంతో నగరంలోని పలు కాలనీలకు తాగునీటి సరఫరా నిలిచిపోయింది. కాశిబుగ్గ ఓసిటీ జంక్షన్‌లో మేఘా గ్యాస్ కంపెనీ పైపులైన్ల కోసం అర్ధరాత్రి సమయంలో కార్పొరేషన్ అధికారులకు ఎలాంటి సమాచారం లేకుండా డ్రిల్లింగ్ చేయడంతో దేశాయిపేట నుంచి వచ్చే ప్రధాన తాగునీటి పైపులైన్ పగిలిపోయింది. దాంతో కాశిబుగ్గ, ఓసిటీ, వివేకానంద కాలనీ, క్రిస్టియన్ కాలనీ, లేబర్‌కాలనీ, గిర్మాజీపేట, చార్‌బౌలి, మండిబజార్, ఎల్‌బీనగర్, తదితర కాలనీలో మంగళవారం తాగునీటి సరఫరా నిలిచిపోయింది. దాంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈమేరకు జీడబ్ల్యూఎంసీ ఏఈ కృష్ణమూర్తికి 18వ డివిజన్ కార్పొరేటర్ వస్కుల బాబు, తదితర కాలనీల నాయకులు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఏఈ కృష్ణమూర్తి మాట్లాడుతూ ఎలాంటి సమాచారం లేకుండా మేఘా గ్యాస్ కంపెనీ వారు పైపులైన్ల కోసం తవ్వారని, దాంతో ప్రధాన తాగునీటి పైపులైను పగిలిపోయిందన్నారు. ట్యాంకుల ద్వారా నీళ్ల సరఫరా చేస్తామని ఆయన తెలిపారు.

సేవా కార్యక్రమాల్లో పాల్గొనాలి



పదవీ విరమణ పొందిన అధికారులతో సీపీ

వరంగల్ క్రైం: పదవీ విరమణ అనంతరం పోలీస్ అధికారులు సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనాలని వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్‌ఝా సూచించారు. వరంగల్ పోలీస్ విభాగంలో దీర్ఘకాలంగా విధులు నిర్వహించి బుధవారం పదవీ విరమణ పొందిన ఇన్‌స్పెక్టర్ వెంకట్రామ్, ఎస్సైలు సంపత్ కుమార్, బాపురావు, మల్లేశం, ఏఆర్ ఏఎస్సై సంపత్ కుమార్, బాబూరావు, ఏఎస్సై సత్యనారాయణ, హెడ్ కానిస్టేబుల్ దేవేందర్ రెడ్డికి జ్ఞాపికలు అందజేసి సన్మానించారు. కార్యక్రమంలో అదనపు డీసీపీలు రవి, సంజీవ్ సురేష్‌కుమార్, ఏసీపీ అనంతయ్య, ఆర్ఐలు శ్రీనివాస్, స్పర్జన్ రాజ్, సతీష్, ఆర్ఎస్ఐ శ్రవణ్ కుమార్, పోలీస్ అధికారుల సంఘం అధ్యక్షుడు శోభన్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

బస్‌స్టేషన్‌ను యుద్ధప్రాతిపదికన నిర్మించాలి



నిరసన తెలుపుతున్న నాయకులు

వరంగల్ చౌరస్తా: వరంగల్ ఆర్టీసీ బస్ స్టేషన్ ఆధునికీకరణలో భాగంగా కూల్చివేసిన స్థానంలో వెంటనే నిర్మాణ పనులను చేపట్టి యుద్ధప్రాతిపదికన పూర్తిచేయాలని ఎంసీపీఐ(యూ) నగర కార్యదర్శి సుంచు జగదీశ్వర్ డిమాండ్ చేశారు. వరంగల్ ఆర్టీసీ బస్‌స్టేషన్ జంక్షన్‌లో పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి బుధవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి వరంగల్ జిల్లాలోని కీలకమైన వరంగల్ స్టేషన్ నుంచి రోజు వేలాదిమంది ప్రయాణికులు వివిధ ప్రాంతాలకు రాకపోకలు సాగిస్తుంటారని తెలిపారు. రైల్వే, బస్ స్టేషన్లకు, కూరగాయలు, పండ్ల మార్కెట్ల సమీపంలో ఉన్న తాత్కాలికంగా బస్‌స్టేషన్ ఆవరణలో సదుపాయాలు కల్పించకపోవడం శోచనీయమని వాపోయారు. కార్యక్రమంలో నాయకులు ఐతం నాగేష్, నలివెల రవి, శ్రీలత, వేణుమాధవ్, రాజేందర్, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

చిట్‌ఫండ్ యాజమాన్యాలపై చర్య తీసుకోవాలి



మాట్లాడుతున్న దొగ్గెల తిరుపతి

హన్మకొండ చౌరస్తా: చిట్టీలు, డిపాజిట్ల పేరుతో డబ్బులు వసూలు చేసి, సకాలంలో ఇవ్వకుండా మోసం చేస్తున్న చిట్‌ఫండ్ యాజమాన్యాలపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి దొగ్గెల తిరుపతి డిమాండ్ చేశారు. హనుమకొండ కుమార్‌పల్లిలో డీవైఎఫ్ఐ జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశం బుధవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు వారి పిల్లల చదువులు, పెళ్లిళ్లు, సొంతింటి నిర్మాణం కోసం జిల్లాలోని కొన్ని చిట్‌ఫండ్ కంపెనీల్లో రూపాయి రూపాయి పోగేసుకున్న డబ్బులను యజమాన్యాలు సొంతానికి వాడుకుని చిట్టీ కాలపరిమితి ముగిశాక కూడా ఇవ్వకుండా తిప్పుకుంటున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉన్నతాధికారులు స్పందించి చిట్‌ఫండ్ యాజమాన్యాలపై క్రిమినల్ కేసులు నమోదు చేసి, వారి ఆస్తులను జప్తు చేయాలని కోరారు. సమావేశంలో డీవైఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు మాటూరి సతీష్, కోడెపాక ప్రశాంత్, అఖిల్, సురేష్, రవితేజ, నవీన్, శ్రావణ్, తదితరులు పాల్గొన్నారు.

కబ్జా నుంచి దుస్సకుంటను కాపాడాలి



దుస్సకుంటను పరిశీలిస్తున్న తహసీల్దార్ ఇక్బాల్

కాశిబుగ్గ: 19వ డివిజన్ కాశిబుగ్గ కోటిలింగాల గుడి రోడ్డులో ఉన్న దుస్సకుంట (బతుకమ్మ చెరువు)ను కొంత మంది కబ్జా చేసి వ్యాపారాలు చేసుకుంటున్నారని, దాన్ని కాపాడాలని స్థానిక మహిళలు కోరారు. ఈ మేరకు రాష్ట్ర దేవాదాయ, అటవీ పర్యావరణశాఖ మంత్రి కొండా సురేఖకు ఫిర్యాదు చేశారు. మంత్రి ఆదేశాల మేరకు దుస్సకుంటను వరంగల్ తహసీల్దార్ ఎండీ.ఇక్బాల్ బుధవారం మహిళలతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ రికార్డుల ప్రకారం దుస్సకుంట ఎకరం 10 గుంటలు ఉండాలన్నారు. దాన్ని సర్వే చేసి సరిహద్దులు గుర్తిస్తామని పేర్కొన్నారు.